# భక్తిశ్రద్ధలతో బక్రీద్

ముస్లింలు జరుపుకునే రెండో అతి ముఖ్యమైన పండుగ, త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లాలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్‌బలయ్ తీసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 17


రామచంద్రాపురం: శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్


గుమ్మడిదల: వీరన్నగూడెంలోని ఈద్గా వద్ద సామూహికంగా నమాజు చేస్తున్న ముస్లింలు


న్యాల్‌కల్: న్యాల్‌కల్ మసీద్ ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బొల్లారం: బొల్లారంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


అందోల్: జోగిపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్


కోహీర్: జహీరాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సంగారెడ్డి: చిన్నారుల సలాం


బొల్లారం: ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మంగతాయారు, సీఐ గంగాధర్


మునిపల్లి: పెద్దచెల్మడలో..


న్యాల్‌కల్: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్


సంగారెడ్డి: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


జిన్నారం: శివనగర్‌లో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


రామచంద్రాపురం: ఆర్సీపురం మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్


బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న చంటి క్రాంతి కిరణ్

**మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

మునిపల్లి, జూన్ 17: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని క్రాంతికిరణ్ నివాసంలో మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల బీఆర్‌ఎస్ సభ్యత్వం బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దేశం ప్రహ్లాద్ ప్రమాదవశాత్తు మృతి చెందగా వారి కుటుంబానికి బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా చెక్కు అందజేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని, పార్టీ బలోపేతం కోసం ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యకర్తలను బీఆర్‌ఎస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ తాటిపల్లి గ్రామ అధ్యక్షుడు రాజురెడ్డి ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


జిన్నారంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

జిన్నారం, జూన్ 17: మండలంలోని వావిలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1998-99 బ్యాచ్ విద్యార్థులు సోమవారం జిన్నారంలో సమావేశం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుకున్న నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం స్థిరపడిన వ్యాపారం, ఉద్యోగాల గురించి అందరితో పంచుకున్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ కలుసుకోవడంపై అందరు సంతోషం వ్యక్తం చేశారు. వీలునుబట్టి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని నిశ్చయించుకున్నారు.

## గ్రామ సింహాల గర్జన


బొల్లారం మున్సిపాలిటీలో బెంబేలెత్తిస్తున్న కుక్కల గుంపు

**బొల్లారం మున్సిపాలిటీలో వెంటాడుతున్న వీధికుక్కల బెడద**

బొల్లారం, జూన్ 17: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడో ఒకచోట కుక్కల దాడిలో ఒకరిద్దరు గాయ పడుతున్న ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. గతంలో గాంధీనగర్, పోచమ్మ బస్తీల్లో వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో దాదాపు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శునకాలు రోడ్లపై స్వైర విహారం చేస్తుంటే ఎప్పుడు వెంటపడతాయోనని పిల్లలు, పెద్దలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి గుంపులు గుంపులుగా సంచరిస్తూ వచ్చిపోయే వారిని, వాహనాలను వెంబడిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు వీధి కుక్కల కట్టడికి తక్షణమే చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

న్యాల్‌కల్, జూన్ 17: మండలంలోని కల్‌బేమల్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు మహిపాల్ నానమ్మ బోగు మల్లమ్మ మృతిచెందడంతో సోమవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని ప్రకటించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## కేతకీలో సివిల్ కోర్టు జడ్జి పూజలు


న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం, జూన్ 17: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామిని మేడ్చల్ జిల్లా సివిల్ కోర్టు సీనియర్ జడ్జి అర్జున్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం జడ్జికి ఆలయ అర్చక బృందం సభ్యులు వేదమంత్రాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమృత గుండంలోని జలలింగాన్ని దర్శించి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భగుడిలో పార్వతీసమేత సంగమేశ్వర స్వామికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి పూజ కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు జడ్జికి పూలమాల, శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక బృందం తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారంలో వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

జిన్నారం, జూన్ 17: మండల కేంద్రం జిన్నారంలో హైదరాబాద్ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన పద్మజ దవాఖాన వైద్య బృందం సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. జిన్నారం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఎముకలు, నరాలు, చిన్న పిల్లలు, స్త్రీలకు సంబంధించిన వైద్య పరీక్షలతోపాటు సాధారాణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

అందోల్, జూన్ 17: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నాసాగర్ వద్ద సోమవారం జరిగింది. ప్రమాదానికి సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్‌కు చెందిన బట్ట పండరి(24) బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా నారాయణఖేడ్ నుంచి జోగిపేట వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అన్నాసాగర్ కట్టపై ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రయాణికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్నాసాగర్ కట్టపై రోడ్డుకు ఇరువైపులా చెట్లకొమ్మలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ముందు నుంచి వచ్చే వాహనాలు కనబడక ఈ ప్రమాదం జరిగిందని.. తరుచూ ఇలాగే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పదించి రోడ్డుకు అడ్డంగా పెరిగిన కొమ్మలు తొలిగించాలని కోరారు.

## 'కట్టు కాల్వను మాయం చేశారు'


ముచ్చర్ల పెద్దచెరువు కట్టు కాల్వ కల్వర్టు దుస్థితిని చూపుతున్న ఎంపీటీసీ కిషన్‌రావు

హత్నూర, జూన్ 17: హత్నూర మండలం ముచ్చర్ల శివారులోని పెద్దచెరువు కట్టు కాల్వను పూడ్చివేసి కాల్వ కనిపించకుండా చేసిన ఎన్‌సీఎల్ వేకా, సెక్కోలార్ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ మీనంపల్లి కిషన్‌రావు కోరారు. సోమవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ముచ్చర్ల శివారులోని ఎన్‌సీఎల్ వేకా పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమ లోపల నుంచి గల చెరువు కట్టు కాల్వను పూర్తిగా పూడ్చి వేయడంతో వర్షపునీరు రాకుండా ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం చేశాయన్నారు. మెయిన్ రోడ్డు వద్ద గల ఆయకట్టు కాల్వ కల్వర్టు ప్రధాన పైప్‌లైన్‌ను చెత్తాచెదారంతో పూడ్చివేయడంతో చెరువులోకి నీరు రావడం లేదన్నారు. పలుమార్లు పరిశ్రమల యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు నష్టం చేకూరుస్తున్నారని మండిపడ్డారు. ఆయకట్టు కాల్వను పూడ్చివేసినా నీటి పారుదల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కట్టు కాల్వను కాపాడి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## చినుకుపడితే చీకట్లే..

- చిరు జల్లులకే విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఫోన్‌చేస్తే స్పందన కరువు

హత్నూర, జూన్ 17: విద్యుత్ కోతలు చేస్తే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా అధికారుల్లో మాత్రం మార్పు రావడంలేదు. చిన్నపాటి జల్లులకే విద్యుత్ ఆపరేటర్లు సరఫరాను నిలిపివేస్తున్నారు. కరెంట్ కోసం ఆపరేటర్లకు ఫోన్‌చేస్తే స్పందన కరువైందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండలంలో ఏడు విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నప్పటికీ ఏఒక్క ఉపకేంద్రంలో సిబ్బంది సరిగా విధులు నిర్వహించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా లైన్‌మెన్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు విధి నిర్వహనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయాల్లో చిన్నపాటి వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిపివేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం. కరెంటుకోసం సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు కాల్‌చేస్తే స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా గ్రామాల్లో రాత్రివేళల్లో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిద్రాహారాలు మానుకొని ఉండాల్సిన పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ జిల్లా అధికారులు స్పందించి విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకొని కోతలు లేకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## బీజేపీ ఇన్‌చార్జిని కలిసిన ఢిల్లీ వసంత్


బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్‌తో ఢిల్లీ వసంత్

కోహీర్, జూన్ 17: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్(అలహాబాద్) కుంభమేళా గురించి బీజేపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ నాయకులతో చర్చించామని జహీరాబాద్ బీజేపీ సీనియర్ నాయకుడు ఢిల్లీ వసంత్‌కుమార్ తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ స్థానంలో నిర్వహిస్తున్న ప్రయాగ్‌రాజ్ కుంభమేళా గురించి చర్చించినట్లు తెలిపారు. 25 కోట్ల మందికి పైగా భక్తులు కుంభమేళాకు హాజరయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు.

## కరెంట్ షాక్‌తో బర్రెలు మృతి



హత్నూర, జూన్ 17: కరెంట్ షాక్‌తో రెండు బర్రెలు మృతి చెందిన ఘటన హత్నూర శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి నర్సింహులుకు చెందిన బర్రెలు మేతకోసం వెళ్లగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. మృతిచెందిన బర్రెల విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు కొద్ది రోజులుగా కిందకు వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతోనే మూగజీవాలు మృత్యువాతపడ్డాయని పలువురు రైతులు ఆరోపించారు.

## ఏరులై పారుతున్న గరళం

జిన్నారం, జూన్ 17: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లో రసాయన వ్యర్థాలు ఏరులై పారుతున్నాయి. వానకాలంలో కురిసే ప్రతి చిన్న వర్షం కూడా రసాయన పరిశ్రమలకు మేలు చేస్తున్నది. వాన నీటిలో పరిశ్రమలు వ్యర్థాలను వదులుతున్నాయి. దీంతో అవి నేరుగా గడ్డపోతారం అయ్యమ్మ చెరువు, ఖాజీపల్లిలోని ఖాజీ చెరువులోకి చేరుతున్నాయి. ఇక్కడ చెరువు కింద వ్యవసాయం అనేది ఏండ్ల క్రితమే మరిచిపోయారు. చేపల పెంపకం అంతే సంగతి. గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని జిల్లెల వాగుపై నిర్మించిన సంపులోకి రసాయన వ్యర్థాలు చేరడం, కాల్వల ద్వారా కిందికి పారడం మాములుగా మారింది. సోమవారం కురిసిన వర్షానికి పరిశ్రమల ప్రహరీల నుంచి రసాయన వ్యర్థాలు బయటకు భారీగా దుంకుతున్నాయి. ఏండ్లుగా ఇలాగే జరుగుతున్నా వీటికి శాశ్వత పరిష్కారం మాత్రం అధికారులు చూపడం లేదు.


కాల్వలో ప్రవహిస్తున్న రసాయన వ్యర్థాలు కలిసిన నీరు


పరిశ్రమ ప్రహరీ నుంచి బయటకు వస్తున్న రసాయన వ్యర్థాలు


రసాయన వ్యర్థాలు కలవడంతో బయటకు వస్తున్న రంగుమారిన నీరు